# 'వ్యవసాయాధారిత జూట్, చక్కెర పరిశ్రమల్ని రక్షించి, కార్మిక - రైతాంగ జీవనోపాధికి గ్యారంటీ కల్పించాలి!'

## ఏఐఎఫ్‌టియు(న్యూ), రైతుకూలీసంఘం(ఆం.ప్ర) సదస్సు డిమాండ్




జిల్లా సదస్సుకు హాజరైన కార్మికులు, ఇతర ప్రజానీకం; సదస్సులో ప్రసంగిస్తున్న కా॥ విజయ్‌కుమార్

**విజయనగరం, 20-12-15 :**

అరుణా జూట్‌మిల్లు అక్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలని, వ్యవసాయాధారిత పరిశ్రమల్ని రక్షించాలని డిమాండ్ చేస్తూ విజయనగరం టౌన్ - మెసానిక్ టెంపుల్ హాల్‌లో 20-12-15న ఏఐఎఫ్‌టియు(న్యూ), రైతుకూలీసంఘం(ఆం.ప్ర)ల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు అధ్యక్షవర్గంగా వ్యవహరించిన రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్రసహాయ కార్యదర్శి కా॥డి.వర్మ, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు మరియు అరుణా జూట్‌మిల్లు కార్మిక సంఘం అధ్యక్షులు కా॥బి.శంకరరావులు మాట్లాడుతూ యుపిఏ, ఎన్‌డిఏ ప్రభుత్వాలు పోటీపడిమరీ జూట్, చక్కెర, ఫెర్రో ఎల్లాయిస్, టెక్స్‌టైల్స్ పరిశ్రమల ఎగుమతుల్ని ప్రోత్సహించకుండా, మార్కెట్ కల్పించ కుండా ఆ పరిశ్రమలను సంక్షోభానికి గురిచేశా యన్నారు. నిరంతరం విద్యుత్తు కోతలు విధించటం ద్వారా చిన్న పరిశ్రమలను తీవ్ర ఇబ్బందుల పాల్జేశారన్నారు. 'దీనిమూలంగా వేలసంఖ్యలో పరిశ్రమలు మూతపడ్డాయి. ఉత్తరాంధ్రలోనే 3 జూట్ మిల్లులను ఈ మధ్య కాలంలోనే మూసివేయుటవలన 30వేల కుటుంబాలు రోడ్డునపడ్డాయి. వీరంతా పొట్టచేతబట్టుకుని వలసలు వెళ్తూ, అరాకొర వేతనాలకు వెట్టిచాకిరీ చేస్తూ, అనేక ప్రమాదాలకు బలి అవుతున్నారు. వ్యవసాయ సాగుకు అవకాశాలు లేకుండాచేసి, పరిశ్రమలనుండి నెట్టేసి ఉపాధి భద్రతను దూరం చేస్తున్నారు. ఈ మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా రైతుకూలీలు, కార్మికులు సంఘటితమై పోరాడాల'ని పిలుపునిచ్చారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) అధ్యక్షులు కా॥ గుర్రం విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోడీ విదేశీ పర్యటనలకెగబడ్తూ, పెట్టుబడులకోసం మోకరిల్లు తున్నాడన్నారు. 'దీనికనుగుణంగానే దేశంలో దోపిడీని మరింత సులభతరం చేసేందుకు కార్మిక చట్టాల, భూసేకరణ చట్టాల సవరణలకు పాల్పడ్తూ, జిఎస్‌టి బిల్లు తెచ్చేందుకు తెగ ఉవ్విళ్ళూరుతున్నారు. మేకిన్ ఇండియా పేరుతో మనదేశ సహజ వనరులను, భూములను, అడవులను...అన్నింటినీ విదేశీ పెట్టుబడి పాదాక్రాంతం చేస్తున్నారు. విదేశీ పెట్టుబడికి రక్షణ కల్పిస్తూ, జాతీయ పరిశ్రమలను నిలదొక్కుకో నివ్వకుండా, ఆంక్షలు విధిస్తూ చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ధ్వంసం చేస్తున్నారు. రైతుల ఆత్మహత్యలు పెద్దఎత్తున పెరుగుతున్నా, కార్మికుల ఉపాధి దూరం అవుతున్నా, వృద్ధిరేటు తగ్గుతున్నా అంకెల గారడీతో మోదీ ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత చర్యలకు మీడియా వత్తాసుపలుకుతుంది. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా వున్న అనేక జూట్‌మిల్లులను అక్రమ లాకౌట్‌లు ప్రకటించి, యాజమాన్యాలు నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయి. మిల్లులను తెరిపించి, గడిచిన రోజులకు కార్మికులకు జీతాలు చెల్లింపజేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికున్నది. కార్మికులు చైతన్యవంతమైన పోరాటాలు జరపకుండా, పాలకులతో సంఘర్షణ పడకుండా తమ హక్కులను కాపాడుకోలేరని' కా॥ విజయకుమార్ తన ఉపన్యాసంలో పేర్కొన్నారు.

'జనశక్తి' సంపాదకులు డా॥ పి. జస్వంతరావు మాట్లాడుతూ స్పిన్నింగ్, జూట్, చక్కెర పరిశ్రమల్లో దేశంలోని మెజార్టీ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. 'కార్మికులకు ఉపాధి చూపిస్తున్న బ్రిటిష్‌కాలం నాటి పరిశ్రమలను మరింత అభివృద్ధి చెందించాల్సిందిపోయి, అవే యంత్రాలు, టెక్నాలజీతో నత్తనడక సాగిస్తున్న పాలకుల తీరు గర్హించతగ్గది. బంగ్లాదేశ్ నుండి గోనెలను దిగుమతి చేసుకోవడం వలనే నష్టపోయామంటున్న పాలకులు దేశంలో జనుము పండించే రైతుకు న్యాయమైన ధర అందిస్తున్నారా? ఎరువులు, పురుగుమందులు, విత్తనాలలో విదేశీశక్తుల జోక్యం పెంచటంవంటి చర్యలతో రైతు సతమతమవుతున్నాడు. పండించిన రైతుకు గిట్టుబాటుకాక, ఆత్మహత్యలే శరణ్యమయ్యే పరిస్థితి కల్పిస్తున్నదెవరు? దేశీయ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ)లో గోనె సంచులే వాడాలనే

నిబంధనను యుపిఏ 75% ఎత్తివేస్తే, ఎన్‌డిఏ కూటమి మొత్తం ప్లాస్టిక్ సంచులే వాడాలనే జీవో తెస్తున్నది. ఇదంతా జూట్ పరిశ్రమను నష్టాలబాట పట్టించే, ఉద్దేశ్యపూరితంగా కార్మిక, రైతాంగాన్ని దెబ్బకొట్టే ప్రయత్నమే. ఏడాదికాలంలో గణాంకాలు చూస్తే, 10 లక్షల కోట్ల రుణాలు మోటారు పరిశ్రమలకు యిస్తే, రైతాంగంపేరిట 2 లక్షల కోట్లు యివ్వటం ఎవర్ని రుణాలిచ్చి ప్రోత్సహిస్తుందో, ఎవర్ని అణచివేస్తుందో అర్ధమవుతుంది. బహుళజాతి కంపెనీలకు రెడ్‌కార్పెట్లు పరిచి, ప్రజలను కట్టుబానిసలుగా చేయటం, అన్ని రంగాల్లో ఎఫ్‌డిఐలకు అనుమతిలివ్వటం ద్వారా, ఇది దోపిడిదారుల కొమ్ముకాసే ప్రభుత్వమే కానీ ప్రజలపక్షం వహించే ప్రభుత్వం కాద'ని అర్ధంచేసుకోవాలన్నారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఎస్.ఝాన్సి మాట్లాడుతూ ఉత్తరాంధ్రను వెనకబాటు తనంనుండి బయటపడేయటానికి అంతర్జాతీయ విమానాశ్రయం, థర్మల్‌పవర్ ప్లాంట్లు, అణువిద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు భోగాపురం, పోలాకి, భావనపాడు, అచ్యుతాపురం ప్రాంతాల్లో వేల ఎకరాల భూములు యిచ్చి ప్రజలు సహకరించాలంటూ, దీనినే ప్రభుత్వం అభివృద్ధిగా చూపెడుతుందన్నారు. 'విశాఖ ఏజెన్సీలో గిరిజనులందర్ని అడవుల నుండి, కొండల నుండి తరిమేసేందుకు ఎంతోకాలం నుండి బాక్సైట్ తవ్వకం సన్నాహాలు చేస్తున్నారు. ఆన్‌రాక్, జిందాల్ కంపెనీల ఏర్పాటు కూడా ముందస్తుగా మనకు సంకేతమివ్వటమే. ప్రజల్ని మోసపుచ్చేందుకు ఆకర్షణీయమైన ప్యాకేజీలు, పథకాలు ప్రవేశపెడ్తున్నారు. ప్రస్తుత పాలకులు ఉత్తరాంధ్రలో వున్న గిరిజనుల్ని, రైతుల్ని, కార్మికుల్ని జీవనాధారం లేకుండాచేసి, వలసలకు కారకులవుతూ ప్రజల జీవితాల్ని చిన్నాభిన్నం చేస్తున్నారు. అధికారంలో కొస్తే రైతుల, కార్మికుల ప్రభుత్వాలుగా మారుస్తామని వాగ్దానాలుచేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 17 నెలల కాలంలో చేసేందేమిటి? మిల్లులు మూతబడి, ఉపాధికి దూరమై, నిత్యావసర ధరల పెరుగుదల, రుణభారంతో రైతు ఆత్మహత్యలు పెరిగిపోతున్నా వీటినెలా పరిష్కరించాలనే దిశగా ఆలోచించకుండా సమస్య లన్నింటినీ పక్కదోవ పట్టిస్తున్నారు. వ్యవసాయాన్ని, వ్యవసాయాధారిత పరిశ్రమల్ని బలిపెడ్తున్న పాలకుల నీతిమాలిన రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం రైతాంగంతో కలిసి ఐక్యంగా పోరాడాలన్నారు.

డిసెంబరు 22వ తేదీలోపల జూట్ కార్మికులకు జీతాలు చెల్లించకపోతే, డిసెంబర్ 23 ఉ॥10 గం॥లకు రాస్తారోకోకు పిలుపునిస్తూ ఈ సదస్సు తీర్మానించింది.

ఈ సదస్సులో కా॥గణేష్‌పండా (రాష్ట్రసహాయ కార్యదర్శి, ఏఐఎఫ్‌టియు-(న్యూ), కా॥టి.అరుణ (రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రై.కూ.సం), కా॥రెడ్డి నారాయణరావు (ఆటోయూనియన్ జిల్లా సెక్రటరి, ఏఐఎఫ్‌టియు-న్యూ రాష్ట్రకమిటి సభ్యులు), కా॥శ్రీనునాయుడు (రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు) తదితరులు మాట్లాడారు.

700 మంది కార్మికులతో, రైతుకూలీలతో మెసానిక్ టెంపుల్ హాల్ నుండి కోట, 3 లాంతర్లు, గంటస్తంభం మీదుగా రైల్వేస్టేషన్ వరకూ ప్రదర్శన పట్టణ ప్రజలను ఆలోచింపజేసేవిధంగా, ఉత్తేజ పూరితమైన నినాదాలతో జరిగింది. ప్రజాకళాకారుల సమాఖ్య కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు. పోరాట గేయాలు ఆలపించారు.

ooooo